జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సుజాత

హస్తినాపురం అభివృద్ధికి సహకరించండి

వనస్థలిపురం, జూన్ 18: హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి సహకరించి నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్రీరమణ కాలనీలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. పలు చోట్ల వరదనీటి కాల్వలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు మంజూరైన పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మెట్రో ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి

రామంతాపూర్, జూన్ 18 : మెట్రో ఉద్యోగాల్లో 30 శాతం స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం మెట్రో ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డిని బేగంపేట మెట్రోభవన్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు.

అధ్వానం.. అవస్థలు

అడుగడుగునా గోతులు అవస్థల్లో ప్రజలు

- రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయింపు
- శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు
- ఏడాది గడుస్తున్నా.. ప్రారంభం కాని పనులు

రోడ్డు వేయించాలని టీచర్స్ కాలనీ అసోసియేషన్ నాయకులు మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం. (ఫైల్)

బడంగ్‌పేట, జూన్ 18: బాబోయ్ ఇదేం రోడ్డు.. మారుమూరు గ్రామాల్లో సైతం రోడ్డు ఇలా ఉండదు. నగరంలో భాగమైన టీచర్స్ కాలనీ రోడ్డు పరిస్థితి ఇదీ. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-1 కాలనీవాసులు పలుమార్లు కమిషనర్, మేయర్, స్థానిక కార్పొరేటర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. అదే విధంగా రోడ్డు వేయించాలని కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. స్పందించిన అధికారులు మీ కాలనీకి రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇదే విషయంలో పలుమార్లు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి కాలనీవాసులు ఫిర్యాదులు చేయడంతో.. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రోడ్డు వేయడానికి రూ.10లక్షలు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటికీ ఏడాది కావస్తున్నా పనులు మాత్రం ప్రారంభించలేదు. నడవడానికి కూడా రోడ్డు సరిగా లేకపోవడంతో.. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

నిధులు మంజూరైనా.. పనులు చేయలేదు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలలో రోడ్డు వేయించాలని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేశాం. రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చిన అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా రోడ్డు వేయించాలి.

– జగన్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు

టీచర్ కాలనీ ఫేజ్-1 రోడ్డు దుస్థితి

సహారాస్టేట్స్‌కాలనీలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు చర్యలు

మన్సూరాబాద్, జూన్ 18: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి సహకారంతో వర్షపు నీటిని ఒడిసి పట్టే సరికొత్త ప్రాజెక్టును మంగళవారం ప్రారంభించారు. సహారా కాలనీలో చెత్తాచెదారంతో నిండిపోయి మట్టి పేరుకుపోయిన 12 ఇంకుడు గుంతలు, 2 ఓపెన్ వెల్స్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ మాట్లాడుతూ.. సహారాస్టేట్స్ కాలనీలో పడిన ప్రతి వర్షపు నీటిని ఇంకుడు గుంతలు, ఓపెన్ వెల్స్‌లోకి మళ్లించి భూగర్భ జలాలను వృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో నీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఇలాంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాలనీవాసుల భాగస్వామ్యంతో వర్షపునీటిని సంరక్షించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వాన నీటి సంరక్షణ కోసం కాలనీవాసులు కలిసికట్టుగా ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి, భూతాపాన్ని తగ్గించేందుకు తోడ్పాటునందిస్తాయన్నారు. సుమారు 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న సహారాస్టేట్స్‌కాలనీలో 900 పైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. కాలనీ వాసుల సహకారంతో సంవత్సరానికి 1500 మిలియన్ లీటర్లు (15 కోట్ల లీటర్లు) వాన నీటిని సంరక్షించే ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, మేకల ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గసభ్యుడు నర్సింహా గౌడ్, ఆలయ కమిటీ కార్యదర్శి గంగదాసు కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఎమ్మార్వో కేవన్ నరసింహా చారి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

చర్లపల్లి, జూన్ 18: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 'మనబడి' కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మొక్కలు నాటారు.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పుగూడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన టోర్నీ ఫైనల్లో సాయ్ టీమ్ 41-35 తేడాతో నవశక్తి క్రీడామండల్‌పై విజయం సాధించింది. విజేత, రన్నరప్ జట్లకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీశ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ఎల్బీనగర్, జూన్ 18: గడ్డిఅన్నారం డివిజన్‌లోని ప్రధాన రోడ్డు మార్గాల్లో ఆక్రమణలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎల్బీనగర్ ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోదండరాంనగర్, వివేకానందనగర్ బస్ స్టాప్, లలితానగర్ కాలనీ మధురాపురికాలనీల్లోని ప్రధాన రోడ్లకు ఆక్రమణతో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని తొలగించాలని కోరారు. వివేకానందనగర్ బస్‌స్టాప్‌లో వాహనాలను రోడ్లపైన పార్కింగ్ చేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్టీసీ బస్సులు నడపాలని డిపో మేనేజర్‌ను కోరగా బస్‌స్టాండ్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చారని అన్నారు. కోదండరాంనగర్ రెడ్డిబ్రదర్స్ లేన్‌లో వాహనాలను రోడ్లపైనే నిలిపివేయడంతో నిత్యం కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, మధురాగర్, లలితానగర్‌లలోనూ ఇదే దుస్థితి ఉందని దీనిని పోలీస్ అధికారులు క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ దారిలో కనీసం అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సిద్దాల ఐలయ్య పాల్గొన్నారు.

రాచకొండ ట్రాఫిక్ అదనపు డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి

ఫార్మా భూములు పరిశీలన

ఫార్మాసిటీ భూములు పరిశీలిస్తున్న ధరణి చైర్మన్ కొదండరెడ్డి, తాసీల్దార్, తదితరులు

కందుకూరు, జూన్ 18: ఫార్మాసిటీ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన భూములను ధరణి చైర్మన్ కొదండరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఉదయం భూముల వద్దకు వచ్చి తాసీల్దార్ గోపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మెడికల్ కళాశాలకు కేటాయించిన భూములను పరిశీలించారు. కాగా ఉన్నఫలంగా భూముల పరిశీలనలో ఆంతర్యమేమిటని.. అసలు ఫార్మాసిటీతో పాటు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తారా, లేక ఇతర కంపెనీలు ఏర్పాటు చేస్తారా అనే విషయంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీల లెక్కింపు

చంపాపేట, జూన్ 18: కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాస శర్మ, ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. పర్యవేక్షకులుగా దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ టి.శేఖర్ హాజరై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 82 రోజులకు స్వామివారి ఆలయ హుండీలను లెక్కించగా రూ.32,89,015 ఆదాయం, అమెరికన్ డాలర్లు 329 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కందుకూరు, జూన్ 18 : రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని.. బుధవారం మండల విద్యాపనరుల కేంద్రం వద్ద మండల సీపీఎం పార్టీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ధర్నా నిర్వహించిన అనంతరం మండల విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన అనంతరం పూర్తిగా విస్మరించినట్లు పేర్కొన్నారు. కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయని దీంతో పెరిగిన రేట్లతో కార్మికులకు విద్యార్థులకు భోజన వండి పెట్టడం భారంగా మారిందని చెప్పారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన రేట్లకు అనుగుణంగా బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి ప్రభావతి, అండాలు, అశ్విని, లక్ష్మమ్మ, భారతమ్మ, భాగ్యమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

విద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న బాల్‌రాజ్, కార్మికులు

చక్రీపురం చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

అభివృద్ధికి నిధులు.. హర్షం

చర్లపల్లి, జూన్ 18: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించడం సంతోషకరమని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. నియోజవర్గ అభివృద్ధి, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.101.52కోట్ల నిధులు మంజూరు కావడంతో మంగళవారం చర్లపల్లి డివిజన్ చక్రీపురం చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీనగర్ నుంచి రాంపెల్లి చెరువు వరకు డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.37.07కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సంబంధిత అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో విద్యుత్ అధికారి ఏఈ పృథ్వీ, సిబ్బందితో కార్పొరేటర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, పోచయ్యగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, రాజుగౌడ్, గోపాల్ యాదవ్, ముత్యాలు, పుష్పలత, నజీర్, హనుమంత్‌నాయక్, పాండు, భిక్షపతి, శ్రీను, విజయ్, భానుచందర్, బాల్‌నర్సింహ, నర్సిరెడ్డి, గణేశ్, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, నవనీత, నీరాజరెడ్డి, సంధ్య, అరుణ, మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఐటీఎఫ్ జాతీయ పారా టోర్నీ మంగళవారం ఘనంగా ముగిసింది. బాలికల సబ్‌జూనియర్ అక్వాథ్లాన్ విభాగంలో తెలంగాణకు చెందిన జోహాన్న షిజు రజత పతకంతో మెరిసింది. మిగతా విభాగాల్లో దుర్వీశ పవార్, సోరమ్, నెల్లి, తొకోచామ్ గౌతమ్, అథర్వ్ షాజి పాటిల్, స్నేహల్ జోషి, రోషన్ గోండ్ పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రయథ్లాన్ అధ్యక్షుడు మదన్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. – హైదరాబాద్, ఆట ప్రతినిధి

నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలి

విజయపురి కాలనీ ఫేజ్-1లో జలమండలి అధికారులకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 18: అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేసే సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం విజయపురికాలనీ ఫేజ్-1, శాతవాహన నగర్ కాలనీల్లో పర్యటించారు. డ్రైనేజీ పైపులైన్ వేసిన అధికారులు అక్కడ రోడ్డు వేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులను కాలనీకి పిలిపించి సమస్యను వివరించారు. దాంతోపాటు రహదారులపై వర్షపునీరు నిలుస్తోందని, చెత్తను తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. దీంతో జీహెచ్ఎంసీ ఈఈ రమేశ్ బాబు, ఏఈ నరేందర్‌ను కూడా కాలనీలకు పిలిపించి సమస్యలను చూపించారు. పారిశుధ్య అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలి అధికారులు రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



కొత్తగూడ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ప్రత్యేక అధికారి సరిత

కందుకూరు, జూన్ 18 : గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ, ప్రత్యేక అధికారి సరిత తెలిపారు. కొత్తగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొని రికార్డులను పరిశీలించిన అనంతరం గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామస్తులు కలిసి మెలిసి ఉండాలని సమస్యల వచ్చినప్పుడు సమష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోతే రోగాలబారిన పడుతారని చెప్పారు. వర్షాలు వస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాల వద్దకు పోవద్దని సూచించారు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని అధికారులకు ప్రజలు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. తొలకరి వానలు కురుస్తున్నందుకు పైపులైన్ల లీకేజీ కాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఆశావర్కర్ అనిత, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాధవాచారి, ప్రజలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.